కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

తెలంగాణ చౌక్, మార్చి 4: ఇంటర్మీడియట్ ఫస్టియర్ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా కొనసాగుతున్నట్లు డీఐఈవో సీహెచ్ మోహన్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం జరిగిన ఇంగ్లిష్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 4,609మంది విద్యార్థులకు గానూ 4,396 మంది హాజరైనట్లు వెల్లడించారు. అవాంఛనీయ ఘటనలు ఏవీ లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్ష జరిగినట్లు డీఐఈవో మోహన్‌కుమార్ వెల్లడించారు.

డీపీవో ఆఫీస్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయండి

- జిల్లా కార్యాలయ సందర్శనలో కలెక్టర్ అనురాగ్, ఎస్పీ అఖిల్ మహాజన్

జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్‌మహాజన్

తెలంగాణ చౌక్, మార్చి 4: జిల్లా కేంద్రంలోని బైపాస్‌లో నూతనంగా నిర్మించిన జిల్లా పోలీస్ కార్యాలయాన్ని (డీపీవో) ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్‌మహాజన్ అధికారులను ఆదేశించారు. సోమవారం వారు నూతన డీపీవో కార్యాలయాన్ని ట్రైనీ ఎస్పీ రాహుల్‌రెడ్డి, అదనపు కలెక్టర్ భీమ్యానాయక్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎస్పీ చాంబర్, గ్రీవెన్స్ సెల్‌హాల్, సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ రూమ్‌లు, మీటింగ్‌హాల్, రిసెప్షన్ కౌంటర్, వివిధ విభాగాల పనులను పర్యవేక్షించారు. తుది దశలో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి, సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. వారి వెంట మైనింగ్ ఏడీ రఘుబాబు, ఫైర్‌ఆఫీసర్ వెంకన్న, డీఎస్పీలు నాగేంద్రాచారి, భీమ్‌శర్మ, మున్సిపల్ కమిషనర్ లావణ్య, టౌన్ ప్లానింగ్ అధికారి అన్సారీ, సీఐ రఘుపతి, తదితరులు ఉన్నారు.

లైంగికదాడి కేసులో పదేండ్ల జైలు

గాంధీచౌక్, మార్చి 4: బాలికపై అత్యాచారానికి ప్రయత్నించిన వ్యక్తికి పదేండ్ల జైలు శిక్ష, ₹10వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్ ప్రేమలత సోమవారం తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2017లో కోనరావుపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(8) ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో ఎనుగందుల వెంకటి లైంగిక దాడికికి పాల్పడ్డాడు. సదరు బాలిక కేకలు వేయడంతో స్థానికులు వచ్చేసరికి నిందితుడు పారిపోయాడు. బాలిక తల్లి ఫిర్యాదు పోలీసులు కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ పెంట శ్రీనివాస్ వాదించగా, కోర్టు మానిటరింగ్ ఎస్ఐ శ్రావణ్, కానిస్టేబుళ్లు నరేందర్, మోహన్, లతీఫ్ కోర్టులో 14మంది సాక్ష్యులను ప్రవేశపెట్టారు. పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితుడికి జైలుశిక్ష విధించారు.

సాయిరాం సేకరించిన ఆయా దేశాల కరెన్సీలు

నాబిక్ సమాజ్ భూషణ్ అవార్డు తీసుకుంటున్న సాయిరాం

సాయిరాం హాబీ అదుర్స్

సాయిరాం సేకరించిన నాణేలతో ఏర్పాటుచేసిన ప్రదర్శనను సందర్శిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి (ఫైల్)

- వందల ఏండ్ల క్రితం నాటి నాణేలు, కరెన్సీ సేకరణ
- 25 ఏళ్లుగా దేశవ్యాప్తంగా పర్యటనలు
- అభిరుచికి గుర్తింపుగా వరించిన 'నాబిక్ సమాజ్ భూషణ్' పురస్కారం

సిరిసిల్లలోని గోపాల్‌నగర్‌కు చెందిన కొత్వాల సాయిరాం చిన్ననాటి నుంచి నాణేలు, పాతకాలంలో చెలామణిలో ఉన్న కరెన్సీ సేకరించడం హాబీగా పెట్టుకున్నాడు. వృత్తి రీత్యా క్షౌరశాల నిర్వహిస్తుండే అతను, ప్రవృత్తిగా నాణేలు సేకరిస్తున్నాడు. మరుగున పడిపోయిన చరిత్రను భావితరాల వారికి అందించాలన్న లక్ష్యంతో దేశ వ్యాప్తంగా తిరుగుతూ సేకరిస్తున్నాడు. ఇతడి వద్ద 1616 నాటి రోమన్‌నాణెం, 1881 నాటి విక్టోరియా మహారాణి వెండినాణెం, మొహంజదారో హరప్పా కాలం నాటి నాణేలు, 1919, 1916, 1934, 1947, 1950లోని నాణేలు ఉన్నాయి. వివిధ దేశాల కరెన్సీ సైతం సేకరించాడు.

మహనీయుల చిత్రాలు సైతం..

కరెన్సీయే కాదు జాతికి స్ఫూర్తినిచ్చిన మహనీయులు, ప్రపంచానికి తన అహింసా సిద్ధాంతంతో మార్గదర్శనం చేసిన మహాత్మా గాంధీ చాయాచిత్రాలను ఇప్పటి వరకు 2,500 దాకా సేకరించాడు. ఆనాడు వివిధ పత్రికల్లో మహాత్మాగాంధీకి సంబంధించి ప్రచురితమైన ప్రత్యేక కథనాలను భద్రపరిచాడు. అలాగే అనేక పురస్కారాలను తన ఖాతాలో జమచేసుకున్నాడు. శ్రీ లంబోదర కల్చరల్ అకాడమీ-విజ్ఞరాజా కూచిపూడి అకాడమీ సంయుక్తంగా ఆస్కార్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ అందుకున్నాడు. అలాగే మహారాష్ట్రలోని తెలుగు నాబిక్ జ్ఞాతి సంస్థ 'నాబిక్ సమాజ్ భూషణ్' అవార్డును అందించింది.

నాణేల సేకరణను హాబీగా చేసుకున్న సాయిరాం, 1616 నాటి రోమన్ నాణె నుంచి నేటి దాకా దేశవిదేశాలకు చెందిన కరెన్సీని సేకరించాడు. ఇంకా పాత కాలం నాటి విక్టోరియా మహారాణి వెండినాణెం, మొహంజ దారో హరప్పా కాలం నాటి నాణేలు, ఒక్క పైసా, రెండు పైసలు, మూడు పైసలు ఇలా రూపాయి దాకా ఎన్నో బిళ్లలను సంపాదించాడు. వీటితోపాటే ఆనాటి మహనీయుల చిత్రాలను సేకరించి భద్రపరుస్తుండగా, సాయిరాం అభిరుచిని గుర్తించిన మహారాష్ట్రలోని తెలుగు నాబిక్ జ్ఞాతి సంస్థ 'నాబిక్ సమాజ్ భూషణ్' అవార్డును అందించింది.

– సిరిసిల్ల టౌన్, మార్చి 4

సొదరుడి స్ఫూర్తితో ..

చిన్నప్పుడు మా చిన్నాన్న కొడుకు నాణేలు సేకరించేవాడు. అతడి స్ఫూర్తితోనే తాను కూడా మన చరిత్రను భావితరాలకు అందించాలన్న లక్ష్యంతో ఆరేండ్ల వయస్సు నుంచే నాణేలు సేకరించడం అలవాటుగా మార్చుకున్నా. అరుదైన నాణేల కోసం అధిక మొత్తం చెల్లించి కొనుగోలు చేసిన సందర్భాలున్నాయి. బంధువులు, స్నేహితుల ద్వారా పలు దేశాల కరెన్సీ సేకరించా.

- సాయిరాం కొత్వాల, సిరిసిల్ల

ఉచిత డ్రైవింగ్ శిక్షణకు ఆహ్వానం

కలెక్టరేట్/సిరిసిల్ల రూరల్, మార్చి 4: తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్(టైడ్స్) ఆధ్వర్యంలో లైట్‌మోటార్ వెహికల్(ఎల్ఎంవీ), హెవీ మోటార్‌వెహికల్ (హెచ్ఎంవీ)లో గ్రామీణ యువతకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు టైడ్స్ ప్రిన్సిపాల్ రాఘవన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన, ఎంప్లాయిమెంట్ జనరేషన్, మార్కెటింగ్ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో మూడు నెలల ఉచిత శిక్షణ కార్యక్రమం తంగళ్లపల్లి మండలం మండెపల్లి టైడ్స్‌లో ఉంటుందన్నారు. శిక్షణకు హాజరయ్యే యువతకు టైడ్స్‌లోనే ఉచిత వసతి సౌకర్యం ఉంటుందని తెలిపారు. ఈ నెల 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, 16నుంచి ఉచిత డ్రైవింగ్ శిక్షణ ప్రారంభమవుతుందని చెప్పారు. పదో తరగతి పాస్ లేదా ఫెయిల్‌వారు అర్హులని తెలిపారు. పూర్తి వివరాల కోసం నంబర్ (89854-31720)లో సంప్రదించాలని సూచించారు.

365రోజులు పని కల్పించాలి

- వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్
- నేడు సీఐటీయూ ఆధ్వర్యంలో ఫ్లకార్డులతో ప్రదర్శన

సమావేశంలో మాట్లాడుతున్న వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్

కలెక్టరేట్, మార్చి4: సీఎం సిరిసిల్ల పర్యటన నేపథ్యంలో పవర్‌లూం కార్మికులతో సమావేశం నిర్వహించి 365రోజులు పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ డిమాండ్ చేశారు. సోమవారం సిరిసిల్ల సీఐటీయూ కార్యాలయంలో నక్క దేవదాస్ అధ్యక్షతన పవర్‌లూం వర్కర్స్ యూనియన్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ, ఈ నెల 7న సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభ నివారణ కోసం, నిరంతరం ఉపాధి కోసం కార్మికులతో సమీక్షా సమావేశం నిర్వహించాలన్నారు. కార్మికులు, ఆసాములకు 365రోజులు ఉపాధి భరోసా కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కొత్త బస్టాండ్‌లోని తెలంగాణ చౌక్‌వద్ద ఫ్లకార్డులతో ప్రదర్శన చేపట్టినట్లు తెలిపారు. కార్మికులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మూడు నెలల నుంచి యజమానులు పరిశ్రమలను మూసి వేస్తున్నారని, వస్త్ర పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులు, ఆసాములు వార్పిన్, వైపని, గుమస్తా, జాఘర్లకు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో పస్తులు ఉంటున్నారని, వస్త్ర పరిశ్రమను ప్రభుత్వం ఆదుకోకుంటే కనుమరుగయ్యే పరిస్థితి నెలకొందన్నారు. బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వాలని, పెండింగ్ బకాయిలు, యారన్ సబ్సిడీ విడుదల చేయాలని, వర్కర్ టూ ఓనర్ పథకం అమలు చేసి, కార్మికులకు ఉపాధి కల్పించాలన్నారు. సమావేశంలో సీఐటీయూ నేతలు ఎలిగేటి రాజశేఖర్, సిరిమల్లె సత్యం, గుండు రమేశ్, ఒగ్గు గణేశ్, సబ్బని చంద్రకాంత్, కందిమల్లేశం, బింగి సంపత్ పాల్గొన్నారు.

200యూనిట్ల విద్యుత్‌కు జీరో బిల్

- ఆరు గ్యారెంటీలు అమలు చేస్తాం
- గృహజ్యోతి ప్రారంభోత్సవంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, మార్చి 4 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు జీరో టికెట్ మాదిరిగా, 200యూనిట్ల లోపు వినియోగించే విద్యుత్ వినియోగదారులందరికీ జీరో బిల్ ఇవ్వనున్నట్లు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సిరిసిల్ల సహకార విద్యుత్ సంస్థలో సోమవారం గృహజ్యోతి పథకాన్ని సెస్ చైర్మన్ చిక్కాల రామారావుతో కలిసి ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, వంద రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 200యునిట్ల లోపు విద్యుత్ వినియోగించే యజమానుల బిల్లులు నేరుగా ప్రభుత్వమే సెస్, ట్రాన్స్‌కోకు చెల్లించేలా ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. సెస్‌ను ప్రభుత్వంలో కలుపాలని ఈఆర్‌సీ సిఫారసు చేసిందని, ఎంతో చరిత్ర కలిగిన సెస్‌ను కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. సెస్ అధికారులు అకారణంగా కరెంట్ తీసివేయకూడదని చెప్పారు.సెస్ చైర్మన్ మాట్లాడుతూ, గృహజ్యోతి పథకం కింద జిల్లాలో 82,800మంది వినియోగదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇక్కడ జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, సెస్ ఎండీ సూర్యచంద్రరావు, వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి ఉన్నారు.

పట్టుదలతో చదవాలి

రుద్రంగి, మార్చి 4: విద్యార్థులు పట్టుదలతో చదివి భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి చేరుకోవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని కేరళ స్కూల్‌లో ఫేర్‌వెల్ డే వేడుకలు నిర్వహించగా, విప్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఇక్కడ మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత, నాయకులు తర్రె మనోహర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం

ఇల్లంతకుంట, మార్చి 4: వల్లంపట్లలో రేణుకాఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి పెద్దలింగాపూర్ మాజీ సర్పంచ్ గొడిసెల జితేందర్ గౌడ్ సోమవారం రూ.10,166 అందించారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు, సంఘం సభ్యులు అభినందించారు.

బాధిత కుటుంబాలకు చల్మెడ పరామర్శ

బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

కోనరావుపేట, మార్చి 4: నిజామాబాద్ గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ కేతిరెడ్డి రవీందర్‌రెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించారు. అలాగే బావుసాయిపేటలో బీఆర్ఎస్ కార్యకర్త వంగాల సురేంద్రబాబు తండ్రి ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెఇపారు. అలాగే బీఆర్ఎస్ కార్యకర్త షేక్ యూసుఫ్ ఇంట్లో శుభకార్యానికి హాజరయ్యారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ బండ నర్సయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య, సీనియర్ నాయకులు న్యాలకొండ రాఘవరెడ్డి, రామతీర్థపు రాజు, కౌన్సిలర్ గోలి మహేశ్, లింగంపేట ఎంపీటీసీ రమేశ్‌రావు, గ్రామ శాఖ అధ్యక్షుడు బైరగొని రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి ₹84కోట్లు

అదనపు కలెక్టర్ గౌతమిని సన్మానిస్తున్న చైర్‌పర్సన్ జిందం కళ, పాలకవర్గ సభ్యులు

సిరిసిల్ల టౌన్, మార్చి 4: సిరిసిల్ల మున్సిపల్ 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ సమావేశం సోమవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగింది. ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ పీ గౌతమి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అర్థవంతమైన బడ్జెట్ రూపకల్పన చేసిన మున్సిపల్ యంత్రాంగం, పాలకవర్గానికి అభినందనలు తెలిపారు. ఆదాయ వనరులు ఇంటి పన్నులు, నల్లా పన్ను, మున్సిపల్ సముదాయాల అద్దె వసూల్లు పూర్తి స్థాయిలో వసూలు చేసి వీటిలో నుంచి విలీన గ్రామాల అభివృద్ధి, మురికి వాడల, వెనకబడిన వాడల అభివృద్ధితో పాటు హరితహారం నిధులు కేటాయించారని తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ మాట్లాడుతూ, పట్టణాభివృద్ధిలో భాగంగా ₹84.32 కోట్ల అంచనాతో బడ్జెట్‌ను రూపొందించామన్నారు. గ్రీనరీ కోసం ప్రత్యేక బడ్జెట్‌ను తయారు చేశామన్నారు. బడ్జెట్‌లోని మొత్తంలో పది శాతం బడ్జెట్‌ను హరితహారం కోసం కేటాయించినట్లు తెలిపారు. మౌలిక వసతుల కల్పన కోసం 1/3వంతు నిధులను కేటాయించామని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ లావణ్య, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

దాహంకోసం వచ్చి.. బావిలోపడ్డ దుప్పి..

- సురక్షితంగా బయటకు తీసిన ఫారెస్ట్ అధికారులు

తాళ్ల సాయంతో చుక్కల దుప్పిని బయటికి తీసిన ఫారెస్ట్ అధికారులు, గ్రామస్తులు

అటవీ ప్రాంతం నుంచి దాహం కోసం వచ్చిన చుక్కల దుప్పి ప్రమాదవశాత్తు బావిలో పడడంతో అధికారులు సురక్షితంగా బయటకు తీశారు. ఈ ఘటన మరిమడ్లలో చోటుచేసుకున్నది. ఆకుల రాజేశం అనే రైతు వ్యవసాయ బావిలో చుక్కల దుప్పి సోమవారం పడింది. అటుగా వెళ్లిన ఓ వ్యక్తి గమనించి గ్రామస్తులకు సమాచారం అందించాడు. ఎఫ్ఎస్‌వో ఆయూబ్‌ఖాన్ అక్కడికి చేరుకుని గ్రామస్తుల సహకారంతో దుప్పిని సురక్షితంగా బయటకు తీశారు. తర్వాత అటవీ ప్రాంతంలో వదిలేశారు. ఇక్కడ బీట్ ఆఫీసర్ శ్రీశైలం ఉన్నారు.

– కోనరావుపేట, మార్చి 4

సౌకర్యాలు కల్పించాలి

వేములవాడ టౌన్, మార్చి 4: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మున్సిపల్ పరిధిలోని అన్ని మసీదుల వద్ద సౌకర్యాలు కల్పించాలని పట్టణ ముస్లిం కమిటీ అధ్యక్షుడు మహ్మద్ అక్రం సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, కమిషనర్ అన్వేష్‌కు వినతిపత్రం అందించారు. ఇక్కడ మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు బాబున్, కమిటీ కార్యదర్శి వలీ, మాజీ అధ్యక్షుడు అష్జద్‌పాషా, మసీదు అధ్యక్షులు షేక్ ఇమామ్, సర్వర్‌పాషా, రజాక్, బషీర్, యూసుఫ్, రహీం, తదితరులు ఉన్నారు.

స్వామివారి దర్శనం కోసం క్యూలో బారులు తీరిన భక్తులు

పోటెత్తిన భక్తజనం

వేములవాడ టౌన్, మార్చి 4 : రాజన్న ఆలయం సోమవారం భక్తులతో పోటెత్తింది. వేకువజామునుంచే భక్తులు ధర్మగుండంలో స్నానాలు చేసి జిగ్‌జాగ్ క్యూలైన్లలో గంటల తరబడి నిలబడి రాజన్నను దర్శించుకోవడంతో పాటు కోడెమొక్కు తీర్చుకున్నారు. వివిధ అర్జితసేవల ద్వారా రూ.24 లక్షల ఆదాయం సమకూరిందని, సుమారు 40 వేలకు పైగా భక్తులు దర్శించుకున్నారని ఆలయ అధికారులు వెల్లడించారు.

మహా శివరాత్రి జాతరకు రావాలని ఆహ్వానం

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఈవో కృష్ణప్రసాద్

కమిషనర్‌కు జాతర ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ ఈవో కృష్ణప్రసాద్

వేములవాడ టౌన్, మార్చి 4: రాజన్న క్షేత్రంలో ఈ నెల 7నుంచి 9వ తేదీ వరకు మూడు రోజులపాటు మహా శివరాత్రి జాతరను వైభవంగా నిర్వహించనున్నారు. ఈ క్రమంలో జాతరకు హాజరుకావాలని కోరుతూ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌కు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ సోమవారం ఆహ్వాన పత్రికలు అందించారు. ఇక్కడ ఆలయ పర్యవేక్షకుడు నాగుల మహేశ్, ఈవో సీసీ ఎడ్ల శివ ఉన్నారు.

ఒకరిపై కేసు నమోదు

తెలంగాణ చౌక్, మార్చి 4: పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును తీసివేయడానికి డబ్బులు డిమాండ్ చేస్తూ చంపుతామని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ రఘుపతి సోమవారం వెల్లడించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ గ్రామానికి చెందిన కొంపెల్లి విష్ణువర్ధన్ అనే వ్యక్తి ఇసుక ట్రాక్టర్‌తో పట్టుబడగా, సిరిసిల్ల టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. తాను పోలీసులతో మాట్లాడి ట్రాక్టర్ విడిపించి తీసుకువస్తానని.. ఇందు కోసం తనకు రూ.50వేలు ఇవ్వాలని, లేకుంటే చంపుతానని గ్రామానికి చెందిన తుంగపల్లి విజయ్ బెదిరింపులకు పాల్పడుతున్నాడని విష్ణువర్ధన్ ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు విష్ణువర్ధన్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

జీ టూ పీజీ ప్రాంగణంలో ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న నోడల్ అధికారి గంగారాం

కేజీ టూ పీజీలో సైన్స్‌ఫెయిర్

గంభీరావుపేట, మార్చి4: మండల కేంద్రంలోని కేజీ టూ పీజీ విద్యా సముదాయంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం సైన్స్‌ఫెయిర్ నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన ఎగ్జిబిట్లను మండల నోడల్ అధికారి గంగారాం పరిశీలించారు. చిన్నప్పటి నుంచి శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.

దాచారం జడ్పీహెచ్ఎస్‌లో మాక్ పోలింగ్

మాక్ పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఇల్లంతకుంట, మార్చి 4: దాచారం జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం మాక్‌పోలింగ్ నిర్వహించారు. అభ్యర్థులు, పోలింగ్ కేంద్రాల విధానం, బ్యాలెట్ పత్రాలు, ఓటింగ్ విధానం, ఎన్నికల ప్రక్రియ గురించి పూర్తి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఓట్ల లెక్కింపు విధానం, గెలిచిన పార్టీ అభ్యర్థులు ప్రమాణ స్వీకారం చేసే విధానం గురించి వివరించారు.

స్నేహితుడి కుటుంబానికి సాయం

ఎల్లారెడ్డిపేట, మార్చి 4: అల్మాస్‌పూర్‌కు చెందిన బూరుగుపల్లి నరేందర్ నాలుగేండ్ల క్రితం కరెంట్‌షాక్‌తో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్న నరేందర్ బాల్య స్నేహితులు సోమవారం తమవంతుగా రూ.20వేలు అందించి భరోసాగా నిలిచారు. ఇక్కడ ఉత్తమ్ ఆంజనే యులు, బత్తిని శ్రీధర్, బొడ్డు పరశురాములు, కంచర్ల తిరుపతి, దానవేని పరశురాములు, గొడుగు రవి, తదితరులు ఉన్నారు.

వైస్ఎంపీపీ ఎన్నికకు త్వరలోనే నోటిఫికేషన్

వేములవాడ రూరల్, మార్చి 4: చింతల్‌ఠాణా ఎంపీటీసీ ఆర్‌సీ రావు ఇటీవల వైస్ ఎంపీపీ పదవీ రాజీనామా చేశారు. ఈ క్రమంలో వైస్ఎంపీపీ పదవీ కోసం త్వరలో నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు ఎంపీడీవో మల్లోత్రా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కల్యాణోత్సవానికి రావాలని ఆహ్వానం

కేటీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న గౌడ సంఘం నాయకులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 4: నారాయణపూర్‌లోని గౌడ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 12, 18, 19 తేదీల్లో నిర్వహించే రేణుకా-జమదగ్ని కల్యాణమహోత్సవానికి రావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్‌కు గౌడ సంఘం నాయకులు ఆహ్వాన పత్రిక అందించారు. ఈ మేరకు సోమవారం వారు తెలంగాణభవన్‌లో కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక్కడ పాముల దేవరాజు, బొల్గం రాధాకృష్ణ, లింగాల యాదగిరి, బొల్గం గోవర్దన్, మెరుగు గోవర్దన్, పాముల దేవరాజు, తదితరులు ఉన్నారు.

నిరుపేదలకు వరం కల్యాణలక్ష్మి

ఇల్లంతకుంట, మార్చి4: నిరుపేదలకు కల్యాణలక్ష్మి వరమని ఎంపీపీ వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్‌లో 45మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసి, మాట్లాడారు. కల్యాణలక్ష్మి పథకం నిరుపేదల కుటుంబాలకు వరమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్ఐ షఫీ, ఎంపీటీసీలు ఒగ్గు నర్సయ్య, తీగల పుష్పలత, కరివేద స్వప్న, కాథ సుమలత తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి లబ్ధిదారులతోఎంపీపీ వెంకటరమణారెడ్డి